ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 26 సెప్టెంబరు 2024



నిబంధనలు తుస్!



విచ్చలవిడిగా టపాసుల
విక్రయాలు

- తనిఖీల్లో బయటపడుతున్న నిల్వలు
- ఇళ్ల మధ్యలోనే అనధికార గోదాములు
- పట్టించుకోని అధికారులు

పరిగిలో తనిఖీల్లో పట్టుబడిన టపాసులు

వెలుగులు చిమ్మే దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయాలు ఊపందుకుంటున్నాయి. నిబంధనలు మాత్రం పట్టించుకోకుండా బాణసంచా నిలువలను అనధికార గోదాముల్లో ఉంచుతున్నా.. యంత్రాంగం దృష్టి సారించట్లేదు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం కొన్ని ప్రాంతాల్లో బాణసంచా నిల్వలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన బాణసంచా బయటపడింది. దీనిని బట్టి చూస్తే దీపావళికే కాదు.. ఏడాదంతా విక్రయాలు సాగిస్తున్నారన్న విషయం బహిర్గతమవుతోంది. హిందూపురంలో ఇద్దరికి మాత్రమే బాణసంచా గోదాములకు అనుమతి ఉంది. ఒకరికి పెనుకొండ నియోజకవర్గ పరిధిలో గోదాము ఉండగా.. మరో వ్యాపారికి హిందూపురంలో ఉంది. ప్రస్తుతం అది నిబంధనలకు విరుద్ధమని అధికారులే చెప్పడం గమనార్హం. దీంతో హిందూపురం ప్రాంతంలో నిబంధనలకు అనుగుణంగా ఒక్క గోదాము కూడా లేదు. ఏటా పండుగలు, వివిధ ర్యాలీలకు రూ.కోట్లలో వ్యాపారం మాత్రం సాగుతోంది. - హిందూపురం

●పట్టించుకోని అధికారులు

అనధికారికంగా టపాసులు నిల్వ ఉంచిన గోదాముల వద్ద ప్రమాదాలు జరిగి, భారీ ప్రాణనష్టం సంభవిస్తోంది. అలా జరిగితేతప్ప.. హిందూపురంలో కూడా చర్యలు తీసుకోరా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలో చాలామంది వ్యాపారులు అనధికారికంగా ఇళ్లమధ్యలోనే టపాసులు నిల్వ ఉంచుకున్నారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు దీపావళి పండగ అయ్యాక మిగిలిన సరుకు ఎక్కడ నిల్వ ఉంచుతారో తెలియనిది కాదు. ఏడాదిపొడవునా రాజకీయ పార్టీల ర్యాలీలు, విజయోత్సవ సంబరాలు, పండుగలు, పెళ్లిళ్ల సందర్భంగా లక్షలాది రూపాయల బాణసంచా పేల్చుతుంటారు. ఇది సంబంధిత అధికారుల ముందే జరుగుతున్నా ఎక్కడి నుంచి వచ్చిందో ఒక్కసారి కూడా ఆలోచించకపోవడం శోచనీయం.

విచ్చలవిడిగా విక్రయాలు

హిందూపురంలో దీపావళి పండుగ సందర్భంగా 20 మందికిపైగా తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేస్తారు. సరుకు 60 శాతమే అమ్ముడుపోతుంది. మిగిలిన 40 శాతం సరుకు అనధికారికంగా నిల్వ చేస్తారు. ఇళ్లమధ్యలోనే ఉంచుకుంటారు. అయినా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. దీంతో హిందూపురంలో ఏడాది పొడవునా బాణసంచా విక్రయాలు కొనసాగుతుంటాయి. ఏడాదిలో ఇలా రూ.కోటి విలువైన బాణసంచా విక్రయాలు సాగుతుంటాయని సమాచారం.

ఇళ్ల మధ్యలోనే నిల్వలు

బాణసంచా హిందూపురంలో ఇళ్ల మధ్యలోనే నిలువ చేసుకున్నట్లు గతంలో పట్టుబడిన దాఖలాలు చెబుతున్నాయి. మోతుకపల్లికి వెళ్లే దారిలోఓ వ్యాపారికి గోదాము ఉంది. 20ఏళ్ల క్రితం అక్కడ లైసెన్స్ మంజూరు చేశారు. అప్పట్లో ఆ గోడౌన్ సమీపంలో జనావాస ప్రాంతాలు లేవు. ప్రస్తుతం ఆ చుట్టూ ఇళ్లు నిర్మించుకున్నారు. ఈనేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల క్రితం హిందూపురంలో పనిచేసిన తహసీల్దార్.. సదరు వ్యాపారిని పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఊరుబయట ఎక్కడైనా నిల్వ చేసుకోవాలని ఇక్కడి నుంచి తరలించాలని చెప్పారు. ఆతరువాత ఏమైందో తెలియదుకానీ అక్కడే గోదాము కొనసాగుతోంది. మిగిలిన వ్యాపారులు పట్టణంలోని ఓ పోలీసు స్టేషన్ సమీపంలోని ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచుకుని విక్రయాలు సాగిస్తున్నారు. మరోవ్యక్తి పట్టణంలోని ఓ ప్రధాన సర్కిల్ వద్ద ఇళ్లమధ్యలో ఉన్న చిన్నపాటి గోడౌన్‌లోనే బాణసంచా నిల్వ ఉంచినట్లు సమాచారం. ఓ కళాశాలలో పనిచేసే ఉద్యోగి భారీఎత్తున టపాసుల విక్రయాలు సాగిస్తున్నాడు. ఆ వ్యక్తి ఎక్కడ నిల్వ ఉంచాడో అధికారులకే ఎరుక. అటువైపు చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్నాడు. తూముకుంట పారిశ్రామికవాడ ప్రాంతంలో భారీ ఎత్తున కొంతమంది ఇప్పటికే టపాసులు నిల్వ చేసినట్లు సమాచారం.

వినాయక చవితికి రూ.లక్షల్లో వ్యాపారం

వినాయక చవితి పండగను పురస్కరించుకుని విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం ముగిసే వరకు కొంతమంది నిర్వాహకులు రూ.లక్షలు విలువచేసే టపాసులు పేల్చారు. ఇదంతా హిందూపురంలో కొనుగోలు చేసిందేనని విగ్రహ నిర్వాహకులు చెబుతున్నారు. టపాసుల విక్రేతలు.. విగ్రహాల వద్దకెళ్లి తమ చిరునామా ఇచ్చి డిస్కౌంట్ ఇస్తామని చెప్పారు. ఈ లెక్కన అనధికారికంగా టపాసుల వ్యాపారం ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. నిమజ్జనం రోజే హిందూపురంలో రూ.30 లక్షలకు పైగా టపాసులు పేల్చారు. ఈలెక్కన విక్రయాలను ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని టపాసులు అక్రమంగా నిల్వ చేసిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

తనిఖీల్లో బయటపడుతున్న నిల్వలు

పట్టణంతోపాటు మండల కేంద్రంలో భారీ ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. సోమవారం పరిగిలో పోలీసులు తనిఖీచేయగా భారీఎత్తున బాణసంచా నిల్వలు బయటపడ్డాయి. హిందూపురంలో ఏస్థాయిలో అనధికారికంగా నిల్వ చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపడితే మరిన్ని నిల్వలు వెలుగులోకి వస్తాయి.

అక్రమంగా నిల్వచేస్తే కేసులు నమోదు చేస్తాం

అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇళ్ల మధ్యలో బాణసంచా నిల్వ చేసి ఉండుంటే క్రిమినల్ కేసులు కట్టడానికి కూడా వెనకాడం. పండుగకు అనుమతి ఉన్నవారు మాత్రమే విక్రయించుకోవాలి.



- మహేష్,
డీఎస్పీ, హిందూపురం

శంకర్‌నారాయణే కావాలి..!

ఉష శ్రీచరణ్ వద్దంటూ అసమ్మతి గళం

పెనుకొండ, సోమందేపల్లిలో వైసీపీ నాయకుల సమావేశం



పెనుకొండలో వైసీపీ నాయకులు సమావేశం

పెనుకొండ రూరల్/సోమందేపల్లి, సెప్టెంబరు 25: తెలుగుదేశం పార్టీ కంచుకోట అయిన పెనుకొండలో విజయం సాధించిన మాజీ మంత్రి శంకర్‌నారాయణే కావాలని.. ఉషశ్రీ వద్దని మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్, వైసీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునిమడుగు శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వైసీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి నివాసంలో శంకర్‌నారాయణకు మద్దతుగా బుధవారం మండల నాయకులు, కౌన్సిలర్లు సమావేశం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వైసీపీ నాయకులు మాట్లాడుతూ పెనుకొండ కోటపై వైసీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. 11ఏళ్ల నుంచి శంకర్‌నారాయణ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ 2019లో ఘనవిజయం సాధించారని అన్నారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా శంకర్‌నారాయణను నియమించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి తమ అభిప్రాయం తెలియజేయాలని కార్యకర్తల సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామాంజనేయులు, కౌన్సిలర్లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై సోమందేపల్లిలో కూడా వైసీపీ మండల నాయకులు సమావేశం నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆయన్ను నియమించాలని కోరుతూ అధిష్ఠానాన్ని కోరనున్నట్లు మాజీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వెంకటరత్నం, స్థానిక నాయకులు తెలిపారు.

సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ

పోలీసు అధికారులకు ఎస్పీ రత్న ఆదేశం



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అర్బన్ సీఐ సునీత

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25: సమష్టి కృషితో నేరాలను నియంత్రించి, ప్రజల్లో విశ్వసనీయత పెంచాలని జిల్లా ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో బుధవారం ఆమె కదిరి, పుట్టపర్తి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ, ఎస్టీ, పోక్సో, గంజాయి, హత్యలు, చోరీలు గ్యాంబ్లింగ్, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. పోలీసుస్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల దర్యాప్తులను త్వరగా పూర్తి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో క్రైంరేట్ తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. నేరం చేసినవారికి కోర్టుల్లో శిక్ష పడేలా సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు. చోరీలపై ప్రత్యేక దృష్టి సారించి, కేసుల ఛేదింపు, రికవరీలు వేగంగా చేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కేసుల ఛేదింపులో ప్రతిభ కనపరిచిన 20 మందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు అవుల శ్రీనివాసులు, శివనారాయణస్వామి, ఎస్బీసీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

జైలు.. ఖైదీలకు పాఠశాల కావాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



స్టోర్ రూమ్‌లో వివరాలు తెలుసుకుంటున్న శివప్రసాద్

కదిరి లీగల్, సెప్టెంబరు 25: జైలు ఖైదీల ప్రవర్తనలో మార్పు తెచ్చే పాఠశాల కావాలని అనంతపురం జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన కదిరి సబ్‌జైలును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కోసం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. పరిస్థితుల ప్రభావం వల్ల నేరం చేసి జైలులో ఉన్నవారు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. జైలులో ఉన్నప్పుడు కుటుంబ పరిస్థితులు, భార్య బిడ్డలకు సమాజంలో ఎదురయ్యే అవమానాలు గుర్తుంచుకుని మళ్లీ నేరం చేయకుండా మసలుకోవాలన్నారు. పోలీసుల దృష్టిలో ఒకసారి అసాంఘిక శక్తిగా ముద్రపడితే దాన్ని తుడిచేయడం కష్టమన్నారు. అనంతరం సబ్‌జైలులో ఉన్న సౌకర్యాలు, భోజనము, వైద్య సదుపాయాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలు ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు, బాత్రూంలు, వంటశాల, కాయగూరలు పరిశీలించారు. నిందితులను ప్రతివాయిదాకు న్యాయాధికారి ఎదుట తప్పనిసరిగా హాజరుపరచాలన్నారు. ఖైదీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జైలు అధికారి వాసుదేవరెడ్డిని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, సిరాజుద్దీన్, రఘునాథ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, సెప్టెంబరు 25: దీపావళి పండుగ నేపథ్యంలో టపాకాయల విక్రయాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్ఓ కొండయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల ఐదో తేదీలోపు రూ.500 చలానాతో ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మూడు సెట్ల దరఖాస్తులను కలెక్టరేట్లో అందచేయాలన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమిపూజ

24 గంటల్లోనే ఇంటి పట్టా.. ఇల్లు మంజూరు

పేద కుటుంబానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేయూత

మడకశిర రూరల్, సెప్టెంబరు 25 : ఇల్లు లేక బాత్‌రూమ్‌లోనే నివాసం ఉంటున్న పేద కుటుంబానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేయూతనందించారు. మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో నరసింహప్ప ఇంటి నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వైసీపీ సర్కారు నిర్లక్ష్యం... బాత్‌రూమ్‌లో నివాసం..' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు స్పందించారు. మంగళవారం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ స్థితిగతులను పరిశీలించారు. ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రూ.20 వేలు ఆర్థిక సాయం కూడా అందించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టర్‌తో మాట్లాడారు. 24 గంటలు తిరగకమునుపే నరసంహప్ప కుటుంబానికి ఇంటిపట్టా ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చాలీచాలని స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇళ్లు మంజూరైనా నిర్మించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల ఇంటి నిర్మాణాల కోసం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇచ్చి త్వరలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ, నాగభూషణరెడ్డి, రంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా గోవిందనాయక్

పుట్టపర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్‌గా గోవిందనాయక్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా బాపట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఈఎస్‌గా పని చేస్తున్న గోవిందనాయక్‌ను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన ఆయన మళ్లీ జిల్లాకే నియమితులయ్యారు.

విచారణ నిష్పక్షపాతంగా జరిగేనా..?



విచారణాధికారి స్వప్నసుందరి

- పురం ఆసుపత్రిలో రాష్ట్రస్థాయి అధికారి విచారణ
- ఇద్దరు శిశువుల మరణాలపై ఆరా...

హిందూపురం అర్బన, సెప్టెంబరు 25: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న విచారణ నిష్పక్షపాతంగా జరిగేనా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గైనకాలజీ విభాగానికి చెందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్వప్నసుందరి విచారణ చేపట్టారు. ఆగస్టు 23న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హిందూపురం ఆసుపత్రిలో ఇద్దరు గర్భస్థ శిశువులు మృతి' అనే కథనం ప్రభుత్వం స్పందించింది. శిశువులు మృతి చెందిన విషయంపై విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆమెను నియమించారు. వైద్యులు, నర్సులతో పాటు బాధితులకు సమాచారం అందించి విచారించి నివేదిక ఇవ్వాల్సి ఉంది. బాధితుల్లో ఒకరికి విచారణ తేదీ ఈ నెల 28 అని తెలిపినట్లు వారు ఆంధ్రజ్యోతికి చెప్పారు. మరో మారు ఫోన్‌చేసి బుధవారమే విచారణకు రావాలని చెప్పారని వివరించారు. ముందస్తుగా తెలియకపోవడంతో పనుల నిమిత్తం బయటికి వెళ్లామని, ఇప్పుడు రాలేమని వారు తెలిపినట్లు సమాచారం. ఆసుపత్రిలో రెండు రోజుల పాటు విచారణ చేస్తున్నట్లు ఆసుపత్రి అధికారులకు ఆమె తెలిపారు. వైద్యులు, బాధితులు అందించే సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. బాధితులు లిఖితపూర్వకంగా ఇచ్చినా వాటిని కూడా తీసుకుంటామని చెప్పారు. లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన బాధితురాలి తరఫున ఆమె మామ మూర్తి అప్పట్లో జరిగిన విషయాలను లిఖిత పూర్వకంగా విచారణ అధికారికి అందించారు. విచారణ అధికారిని ఆసుపత్రి ఉన్నతాధికారి ముందస్తుగా కలవడంతో విచారణ నిష్పక్షపాతంగా జరిగేనా అని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 25 : జిల్లాలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కదిరిలో 32.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ధర్మవరంలో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అలాగే సోమందేపల్లి 32.2 మిల్లీమీటర్లు, ఓబులదేవరచెరువు 31.4, బుక్కపట్నం 29.4, గోరంట్లలో 25.8, కొత్తచెరువు 22.0, అమడగూరు 18.4, గాండ్లపెంట 18.2, నల్లమాడ 17.4, పుట్టపర్తి 17.4, అమరాపురం 17.2, రొద్దం 16.4, తలుపుల 16.2, నంబులపూలకుంట 15.0, రొళ్ల 11.4, తనకల్లు 10.6 , పెనుకొండ 10.0, చిలమత్తూరు 8.6, నల్లచెరువు 7.4, పరిగి 7.2, ముదిగుబ్బ 6.6, మడకశిరా 3.6, హిందూపురం 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

సీజీపీకి నీరిస్తాం: ఎమ్మెల్యే

తనకల్లులో సామూహిక సీమంతాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తనకల్లు, సెప్టెంబరు 25: మండలానికి జీవనాధారణమైన సీజీ ప్రాజెక్టుకు తప్పకుండా హంద్రీనీవా జలాలను అందిస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జంబులింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వైఎస్ఎస్, సిరికల్చర్, జనజాగృతి, వెటర్నరీ, వ్యవసాయ, ఐసీడీఎస్, అంగన్‌వాడీ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. జనజాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ లెవల్ ఇండికేటర్స్, రెయిన్‌గేట్, బీడు భూముల సాగు తదితర అంశాలను తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలసముద్రం సీసీరోడ్ల నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో వెంటనే శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సీజీ ప్రాజెక్టుకు తప్పకుండా నీరు ఇస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులకు సూచించారు. గోవిందువారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏడీఏ సత్యనారాయణ, శాస్త్రవేత్త నరసింహారెడ్డి, ఏఓ శ్రీహరినాయక్, పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి, కేశవయ్య, సీడీపీఓ గంగరత్న, సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, గోవిందు, నాగభూషణం, మల్లికార్జున, రవి, అమర్ కార్తికేయ, కుమార్ పాల్గొన్నారు.

సమస్యల స్టేషన్

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పని చేయని ఎస్కలేటర్లు

ప్లాట్‌ఫాంల వద్ద కంపుకొడుతున్న మురుగు వాసన

అపరిశుభ్రంగా పాత వెయిటింగ్ హాళ్లు



మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయిన్

గుంతకల్లు, సెప్టెంబరు 25: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే ప్లాట్‌ఫాంలో సైతం అధికారులు ఎస్కలేటరును ఆఫ్‌లో ఉంచి ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో ప్లాట్‌ఫాంల వద్ద దుర్వాసన వెదజల్లుతోంది. పాత వెయిటింగ్ హాళ్లలో పరిశుభ్రత లోపించిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైలు వచ్చే ఐదు నిమిషాల ముందు మాత్రమే రైలు ఏ ప్లాట్‌ఫాం పైకి వస్తుందో తెలియజేస్తున్నారు. దీంతో లిఫ్టులు, ఎస్కలేటర్లు పని చేయని కారణంగా ప్రయాణికులు పడుతూ లేస్తూ రైలు వచ్చే ప్లాట్‌ఫాం వద్దకు చేరుకుంటున్నారు.

ఎస్కలేటర్లను ఆన్‌లో ఉంచాలి

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2-3, 4-5, 6-7 ప్లాట్‌ఫాంలకు నాలుగు ఎస్కలేటర్లను అమర్చారు. కానీ 1 నెం. ప్లాట్‌ఫారంలో మాత్రమే ఎస్కలేటరును ఆన్‌లో ఉంచుతున్నారు. 2-3, 4-5 ప్లాట్‌ఫాంలలో ఎస్కలేటరును ఆఫ్‌లో ఉంచుతున్నారు. 6-7 ప్లాట్‌ఫాంల ఎస్కలేటర్‌ను సాయంత్రం ప్రయాణికుల రద్దీ ఉన్నప్పుడు మాత్రమే ఆన్‌చేస్తున్నారు. పగలు రైళ్లు ఉన్నా 1వ నెం. ప్లాట్‌ఫాంలో మినహా ఇతర ఎస్కలేటర్లు పని చేయడం లేదు. ఇక రాత్రి 10 గంటలు దాటిందంటే చాలు ఎస్కలేటర్లన్నీ ఆఫైపోతాయి. గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు పగలు కంటే రాత్రి సమయాల్లోనే ఎక్కువ సంఖ్యలో రైళ్లు వస్తుంటాయి. ఆ సమయాల్లో ఎస్కలేటరు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీ, పిల్లలతో పడుతూ లేస్తూ మెట్ల మార్గంలోనే వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణికులు లేనప్పుడు తిరగకుండా.. జనం వచ్చిన వెంటనే రన్ అయ్యేలా ఎస్కలేటర్లకు సెన్సర్లు ఉంటాయి. కానీ విద్యుత్ ఆదా పేరిట ఎలక్ట్రికల్ అధికారులు ఎస్కలేటర్లను లాక్‌చేసి వెళ్లిపోతున్నారు. రాత్రి సమయాల్లో పూర్తిగా ఎస్కలేటరును ఆన్‌లో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా వెయిటింగ్ హాళ్లు

రైల్వే స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన ప్రవేశ భవనంలో ఉన్న వెయిటింగ్ హాళ్ల నిర్వహణ బాగానే ఉన్నా, 7వ నెం. ప్లాట్‌ఫాంలో ఉన్న పాత వెయిటింగ్ హాళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫాంల వద్ద పారిశుధ్య నిర్వహణ బాగానే ఉన్నా, మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయని కారణంగా అక్కడంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాట్‌ఫారాలపై ఆహారం తీసుకునే సమయంలో ఇబ్బందికరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే స్టేషన్‌లో డ్రెయిన్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల భారీ వర్షాలు వచ్చినప్పుడు పలుమార్లు మురుగు కాల్వల నుంచి నీరు పారక ప్లాట్‌ఫాంలకు ఆనుకుని ఉన్న ట్రాక్‌లు మునిగిపోతున్నాయి. కొత్తగా నిర్మించిన 1వ నెంబరు ప్లాట్‌ఫాంపై వేసిన రేకులు వర్షానికి కారుతున్నందున ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వీలైనంత త్వరగా అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు ఉంటారో..?

రిటైర్ కాకుండా కొనసాగుతున్న అంగన్‌వాడీలు

తప్పుడు జనన పత్రాల సమర్పణ

నిద్రమత్తు వీడని అధికారులు



ఐసీడీఎస్‌శాఖ కార్యాలయం

తాడిపత్రి, సెప్టెంబరు 25: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు రిటైర్‌మెంట్ వయస్సు దాటినప్పటికి ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. వీరిని చూస్తున్న పలువురు ఇంకెన్నాళ్లు వి ధుల్లో ఉంటారో అంటూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రా జెక్ట్ పరిధిలో దాదాపు 300 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు రిటైర్‌మెంట్ వయసు దాటిపోయినా కొనసాగుతున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 1990వ దశకంలో 7, 8వ తరగతి చదివిన వారిని కూడా అంగన్‌వాడీ వర్కర్లుగా చేర్చుకున్నారు. అప్పట్లో వారు సమర్పించిన వయసు ధ్రువీకరణ పత్రాలను బట్టిచూస్తే ప్రస్తుతం వారు రిటైర్‌మెంట్ పొందాల్సి ఉంటుంది. కానీ తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ఇంకా విధుల్లో కొనసాగుతున్నారని తెలుస్తోంది.

మత్తువీడని అధికారులు

తప్పుడు ధ్రువీకరణపత్రాలు సమర్పించి విధుల్లో కొనసాగుతున్న పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన ఆ శాఖ అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు వారు విధుల్లో చేరే సమయంలో ఇచ్చిన వయసు ధ్రువీకరణ పత్రాలతోపాటు ఈ మధ్య కాలంలో వచ్చిన ఓపెన్ టెన్త్ సర్టిఫికెట్‌లో వయసును దాదాపు 10 నుంచి 15 సంవత్సరాలపాటు తగ్గించుకొని.. ఆ సర్టిఫికెట్‌ను ఐసీడీఎస్‌కు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సర్టిఫికెట్లలో ఉన్న పుట్టిన తేదీలను ప్రామాణికంగా తీసుకోవడంతో వారు ఇంకా విధుల్లో ఉంటున్నారన్న ప్రచారం సాగుతోంది. దీనిపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నెలరోజుల క్రితం తాడిపత్రి పర్యటనకు వచ్చిన కలెక్టర్ వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు 2015కు ముందు ఉద్యోగాలు పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. కొందరు కార్యకర్తలు సెలవుపై వెళ్లగా, మరికొందరు సర్టిఫికెట్లు కాలిపోయాయని చెప్పడం గమనార్హం. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అడ్డుకొనేందుకు విశ్వప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు యూనియన్ నాయకులను అడ్డు పెట్టుకొని బెదిరింపులకు సైతం దిగారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిష్పక్షపాతంగా విచారణ జరగాలి

అక్రమాలకు పాల్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి నిష్పక్షపాతంగా విచారణ సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విచారణ వేగవంతం చేసి అక్రమార్కులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విచారణకు అడ్డుతగులుతున్న పలువురు యూనియన్ నాయకులను పట్టించుకోకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగంను వివరణ కోరగా.. తప్పుడు వయసు ధ్రువీకరణపత్రాలను ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రస్తుతం విచారణ జరుపుతున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

ధర్మవరం ఘటనలో ఇరు వర్గాలపై కేసు

చట్టం దృష్టిలో అందరూ సమానమే: ఎస్పీ రత్న



పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 25 : ధర్మవరం పట్టణంలో రెండురోజుల క్రితం ఇరు పార్టీల మధ్య చోటుచేసుకున్న సంఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇరు పార్టీల వ్యక్తులపై కేసునమోదు చేసినట్టు ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎవరినీ ఉపేక్షించే పరిస్థితిలేదన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. ప్రజాప్రతినిధులు సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25: జిల్లా పరిధిలో పనిచేస్తున్న పలువురు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాల సెబ్‌లో పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు. అనంతపురం ఎక్సైజ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బాలకృష్ణను తిరుపతి డిస్టిలరీకి బదిలీ చేశారు. విజయవాడ డిస్టిలరీలో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామిని జిల్లాకు బదిలీ చేశారు. గతంలో రాయలసీమ జిల్లాలకు కర్నూలు కేంద్రంగా డిప్యూటీ కమిషనర్ పని చేసేవారు. కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జిల్లాకు డిప్యూటీ కమిషనర్ పోస్టును కేటాయించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న నాగమద్దయ్యను నియమించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో రొళ్ల వాసి



డాక్టర్ కె.మంజునాథ్

రొళ్ల, సెప్టెంబరు 25 : అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ప్రపంచంలోనే ప్రముఖ శాస్త్రవేత్తల జాబితాలో రొళ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన డాక్టర్ కె.మంజునాథ్ చోటు దక్కించుకొన్నారు. మంజునాథ్ పదో తరగతి వరకు రొళ్ల మురళీ పాఠశాల, ఇంటర్ అనంతపురం నారాయణ కళాశాలలో చదివారు. బీఎస్సీ తుమకూరు సిద్దగంగా కళాశాల, ఎమ్మెస్సీ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. తరువాత బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్‌ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థలో ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుతో కలిసి సీనియర్ పోస్ట్ డాక్టోరల్ విద్యార్థిగా ఎన్నో పరిశోధనలు చేశారు. ప్రస్తుతం బెంగళూరులోని నిట్టే మీనాక్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీనియర్ గ్రేడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

పొద్దుతిరుగుడు కనుమరుగు..!

- తగ్గిన సాగు విస్తీర్ణం
- తెగుళ్లు, ధరల పతనమే కారణమా?



ధర్మవరం, సెప్టెంబరు 25: జిల్లాలో కొన్నేళ్ల క్రితం ఎటు చూసినా పొద్దుతిరుగుడు పంట కనిపించేది. గ్రామాల్లో రైతులు ఎక్కువగా ఈ పంట సాగుపైనే దృష్టి సారించేవారు. సాగు ఖర్చు తక్కువ కావడం, దిగుబడి, లాభం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. రాను రాను విత్తన నాణ్యత తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు ఈ పంట సాగును వదిలేశారు. దీంతో వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగు పంట నేడు కనీసం వందల ఎకరాల్లో కూడా కనిపించడంలేదు. గతంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటను రైతులు సాగుచేసేవారు. కదిరి, రొద్దం, పెనుకొండ, తనకల్లు, తలుపుల, తాడిమర్రి, ముదిగుబ్బ, నల్లమాడ, ఎన్‌పీకుంట, ప్రాంతాల్లో అధికంగా సాగుచేసేవారు. గడిచిన ఐదేళ్ల నుంచి ఈ ప్రాంతాల్లో కూడా పొద్దుతిరుగుడు పంట కనిపించకుండా పోయింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా పొద్దుతిరుగుడు పంటను సాగుచేశారు.

సాగు పడిపోవడానికి కారణాలు ఇవే..

పొద్దుతిరుగు పంటకు ప్రధానంగా నల్లతెగుళ్లు, భూమిలో భాస్వరం, పోటాషియం వాడకం పోవడం, ఇతర వైరస్ సోకడంతో పూత రాలిపోతుంది. దీంతో ఆకులు ఎండిపోతూ మొక్కచనిపోతుంది. అదే సమయంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా లభించడంలేదు. క్వింటాలు పొద్దుతిరుగుడుకు రూ.6వేలకు పైగా మద్దతు ధర లభిస్తేకానీ గిట్టుబాటుకాదు. మార్కెట్‌లో గతంలో క్వింటాలు ధర రూ.5500 ఉండేది. ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.3500 వరకు ధర ఉందని రైతులు అంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రముఖ కంపెనీల పేరుతో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనం ప్యాకెట్లు విక్రయించేవారు. దాని వల్ల పంట దిగుబడి సరిగా వచ్చేది కాదు. ఇలా అనేక కారణాలతో రైతులు ఈ పంటను సాగుచేసేందుకు ఏ మాత్రం ముందుకు రావడంలేదు. గతంలో పొద్దుతిరుగుడు ఆయిల్ కొనుగోలు అధికంగా ఉండేది. ప్రస్తుతం పామాయిల్ వాడకం అధికంగా ఉండటం వల్ల కూడా పొద్దుతిరుగుడు విత్తనాలకు డిమాండ్ పడిపోయినట్లు తెలుస్తోంది.

పెట్టుబడులు కూడా రాలేదు..



గతంలో ఐదెకరాల పొలంలో రూ.90వేల వరకు వెచ్చించి పొద్దు తిరుగుడు పంట సాగుచేసేవాళ్లం. పూత దశలో ఎండు తెగుళ్లు సోకుతుండటం వల్ల పంట దిగుబడి తగ్గిపోయి నష్టం వచ్చేది. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో పొద్దుతిరుగుడు సాగు చేయడం మానేశా. ప్రస్తుతం వరి పంటసాగు చేస్తున్నా.

- కెంపుల బాబు, కొత్తచెరువు

గిట్టుబాటు ధరలేదు..



గతంలో నాలుగు ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగు చేశా. మాతో పా టు పక్క రైతులు సా గుచేసేవారు. దాని వ ల్ల గింజపడేటప్పుడు పక్షుల బెడద తగ్గేది. అ ప్పట్లో పొద్దుతిరుగుడుకు తె గుళ్లు వచ్చేవి కావు. ఇప్పుడు తెగుళ్లు అధికమై మందులకు అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. నాలుగు ఎకరాలకు రూ.80వేలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే ఇంటి మనుషులకు కూలి తగ్గట్టు కూడా మిగలడంలేదు.

- కృష్ణారెడ్డి, తాడిమర్రి

తెగుళ్లతోనే తగ్గిన సాగు

పొద్దుతిరుగుడుకు తెగుళ్లు సోకుతుండం, పూత దశలో బ్లైట్స్ అనే తెగులు సోకడం వల్ల పంట దిగుబడి తగ్గుతోంది. ముఖ్యంగా అతివృష్టి, అనావృష్టి వల్ల కూడా పొద్దుతిరుగుడు సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. సత్యసాయి జిల్లాలో కూడా శాస్త్రవేత్తలు భూములను పరిశీలించి ఈ ప్రాంతంలో పొద్దుతిరుగుడు సాగుకు అనుకూలమైన వాతావరణం లేదని గతంలోనే తెలిపారు.

- సుబ్బారావు, ఏడీ, వ్యవసాయశాఖ

విద్యార్థులకు జేఎన్‌టీయూ వరం

- కొనియాడిన కియ ప్రతినిధులు
- వర్సిటీతో ఎంఓయూకు అంగీకారం
- హర్షం వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ



కియ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25: టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు మౌలిక సదుపాయాలు కల్పించిన జేఎన్‌టీయూ ఈ ప్రాంత విద్యార్థులకు వరమని కియ ప్రతినిధులు ప్రశంసించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో కియ ప్రతినిధులు హాంగ్‌సంగ్ పార్క్, హంగు కిమ్, శ్రీహాసన్ వర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం సందర్శించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ల్యాబ్‌లు, సీమెన్స్ ల్యాబ్, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వీసీ సుదర్శన రావు మాట్లాడుతూ, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కియ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం ఉందని అన్నారు. కియను ఫ్యాకల్టీ సందర్శించి, అక్కడి పనులపై పరిశోధనలు చేయవచ్చునని తెలిపారు. రియల్ టైమ్ సమస్యలను పరిష్కరించడానికి, ప్రాజెక్టులు చేయడానికి కియలో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవడానికి కియతో ఒప్పంద కుదుర్చుకునేందుకు ఆహ్వానం పలికామని అన్నారు. కియ ప్రతినిధులు వర్సిటీని సందర్శించి, ఎంఓయూకు ఒప్పుకోవడం శుభపరిణామమని అన్నారు. కియ, జేఎన్‌టీయూ పరస్పర సహకారంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు. ఆ దిశగా గతంలో ప్రయత్నాలు జరగలేదని, దీంతో ఆ సంస్థ ప్రతినిధులు వర్సిటీకి రాలేదని అన్నారు. తొలి సందర్శనలోనే జేఎన్‌టీయూ సేవలను వినియోగించుకునేందుకు కియ ప్రతినిధులు సముఖత వ్యక్తం చేశారని అన్నారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విశాలి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కియ ప్రతినిధులు ఉపాశంకర్ పట్నాయక్, రమేష్‌బాబు, విజయ పాయ్, డీపీపీ కో ఆర్డినేటర్ అరుణ మస్తాని, హెచ్‌ఓడీలు కళ్యాణిరాధ, రామశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్



కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న డీఎస్ విజయకుమార్

గుంతకల్లు, సెప్టెంబరు 25: స్థానిక రైల్వే డీజిల్ షెడ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ కోరారు. బుధవారం ఉదయం మజ్దూర్ యూనియన్ నాయకులు డీజిల్ షెడ్‌ను సందర్శించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. టూల్స్, స్పేర్స్ కొరత, ఉద్యోగులకు మౌలిక వసతుల లేమి తదితర అంశాలపై కార్మికులు సమస్యలను వివరించారు. అనంతరం యూనియన్ నాయకులు షెడ్ సీనియర్ డీఎంఈని కలిసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, సెప్టెంబరు 25: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు అనంత, శ్రీసత్యసాయి జిల్లాల డీఈఓలు వేర్వేరు ప్రకటనల్లో బుధవారం వెల్లడించారు. గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ విద్యా ఏడాది ఐదో తరగతి చదువుతూ...ఆయా జిల్లాల్లో నివాసం ఉండి, 2013 మే 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ, బాలికలకు ప్రవేశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు..

అనంతపురం విద్య: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 13వ వరకూ గడువు పొడిగించారని తెలిపారు. 14న ప్రింటెండ్ నామినల్ రోల్స్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్‌లోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు. కాగా పరీక్షలు డిసెంబరు 8న జరుగుతాయన్నారు.

29న హిందీ మోడల్ టెట్

అనంతపురం విద్య, సెప్టెంబరు 25: హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ రాష్ట్ర స్థాయి ఏపీ టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ టెస్టు నిర్వహించనున్నట్లు హిం దీ సేవాసదన్ వ్యవస్థాపకులు గైబువల్లి బుధవారం ఒక ప్రకటనలో పే ర్కొన్నారు. వ చ్చే నెల 5న ప్రభుత్వం నిర్వహించే టెట్ హిందీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ మోడల్ టెస్ట్ నిర్వహించనట్లు తెలిపారు. వి వరాలకు 958 1386150, 9553677119, 9848783787 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 25: బెంగళూరు కంటోన్మెంటు ప్లాట్‌ఫారాల పనుల కారణంగా మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.12975) రైలుకు డిసెంబరు 19వ తేదీ వరకు ఈ స్టేషన్ స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం జరగదన్నారు. కోయంబత్తూరు-ముంబై రైలు (నెం.11014)ను, ముంబై-కోయంబత్తూరు-ముంబై (నెం. 11013/14) రైళ్లను, బెంగళూరు-న్యూఢిల్లీ (నెం. 12627), బెంగళూరు-ముంబై నెం. 11302) రైలును, బెంగళూరు-నాందేడ్ (నెం. 16593) రైలును డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం ఉండదన్నారు. నాందేడ్-బెంగళూరు (నెం. 16220), ముంబై-బెంగళూరు (నెం. 11301), కాచిగూడ-మైసూరు (నెం. 12785), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (నెం. 18463) రైలుకు, న్యూఢిల్లీ-బెంగళూరు (నెం. 12628) రైలుకు, జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12976)కు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను రద్దుచేసినట్లు తెలియజేశారు.

రథానికి నిప్పు పెట్టింది వైసీపీ నాయకుడే

అరెస్టు చేసిన పోలీసులు


అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పంటించిన ఘటనలో వైసీపీ నాయకుడు బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ జగదీష్ బుధవారం విలేకరులకు తెలిపారు. రాములోరి రథాన్ని 2022లో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి సోదరులు రూ.20లక్షలు వెచ్చించి తయారు చేయించారని అన్నారు. రథం తయారీకి వారు గ్రామంలో ఎవరి సహాయసహకారాలు, చందాలు తీసుకోలేదని, దీంతో గ్రామస్థుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 23న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రథాన్ని భద్రపరిచిన మండపం తాళాలు పగులగొట్టి అందులో ప్రవేశించారని, అనంతరం రథానికి నిప్పు పెట్టారని తెలిపారు. మంటలు ఎగిసి పడటాన్ని మండపం సమీపంలోని ఇళ్ల వారు గమనించి అక్కడికి వచ్చి ఆర్పివేశారని తెలిపారు. రథం తయారీలో తమ సహకారం తీసుకోలేదనే అక్కసుతోనే గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఈ ఘటనకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఐదారుగురిని విచారించామని, ఈశ్వర్‌రెడ్డిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు.



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

రథం దహనం వెనుక హెచ్‌సీ

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, సెప్టెంబరు 25: రాముల వారి రథం దహనం వెనుక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఉందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రథం దహనం కేసులో వైసీపీ నాయకుడు బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ ఘటనపై గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒకే వ్యక్తి రథం తలుపులు బద్దలు కొట్టి నిప్పంటించడం సాధ్యంకాదని అన్నారు. నిందితుడికి నలుగురైదుగురు సహకరించి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారని అన్నారు. కణేకల్లు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించినంత కాలం ఆయన వైసీపీకి తొత్తుగా వ్యవహరించారని ఆరోపించారు. టీడీపీ నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించారని అన్నారు. హనకనహాళ్ గ్రామానికి సంబంధం లేని వ్యక్తి అనంతపురం నుంచి ఎందుకు వచ్చాడని ప్రశ్నించారు. ప్రధాన నిందితుడు ఈశ్వరరెడ్డి రఘునాథరెడ్డికి సమీప బంధువని అన్నారు. బంధువుల్ని కాపాడటానికి వచ్చాడా..? ఒక్కరే నేరం చేసినట్లు నమ్మించే పథకాన్ని రచించడానికి వచ్చాడా అని అనుమానం వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్‌రెడ్డి కాల్ డేటాను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరారు.

సన్న, చిన్నకారు రైతులకు చేయూతనివ్వండి

● కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 25: చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి ఆరామంలో వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలాల్లో భద్రత, పశువుల ఉత్పత్తి పద్ధతులను మెరుగుపరచడానికి రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లాలోని తనకల్లు, రొళ్ల మండలాల్లోని 32 గ్రామాల్లో పౌల్ట్రీపై ట్రాన్స్‌ఫార్మ్ ప్రాజెక్టు పనిచేస్తుందని తద్వారా మంచి ఫలితాలొస్తాయని, వీటిని ఇతరులకు తెలియాల్సి ఉంటుందన్నారు. సన్నకారు రైతుల జీవనోపాధిని పెంచడానికి పెరటికోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. డీఆర్‌డీఏ, సెర్ప్ భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రవికాంత్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ అధికారి కృష్ణచైతన్య, మత్స్య శాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేశారు. పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యంను వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న నాగమణిని సీసీఎస్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న షేక్ జాకీర్‌ను సైబర్ క్రైంకు బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న గోపీనాథ్ రెడ్డిని పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

సమస్యలతో సావాసం

- తాడిమర్రి లో ఏళ్ల తరబడి తిష్ట
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- నేడు మంత్రి సత్యకుమార్ రాక

తాడిమర్రి, సెప్టెంబరు 25: మండలంలో అనేక సంవత్సరాల నుంచి సమస్యలు తిష్ట వేశాయి. తాడిమర్రిలో ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి నేటికీ పరిహారం అందలేదు. దీంతో వారు పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ముఖ్యంగా మండలంలో సాగునీరు అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పీఏబీఆర్ కుడికాలువ, పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేయకపోవడంతో ఈ మండల రైతులు సాగుకు దూరమయ్యారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా తాడిమర్రిలోని రెండు చెరువులు, అగ్రహారం, మేడిమాకులపల్లి, ఏకపాదంపల్లి, పుల్లప్పపల్లి చెరువులకు సాగునీరు అందించాల్సి ఉంది. మండలంలోని రామాపురం, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, శివంపల్లి గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొత్త విద్యుత్ కనెక్షన్లు, డీపీల కోసం మండల వ్యాప్తంగా అనేక మంది రైతులు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నా.. అవి మంజూరు కాలేదు. తాడిమర్రిలో గ్రంథాలయ భవనం కూలి.. సంవత్సరాలు అవుతోంది. దాని స్థానం నూతన భవనాన్ని నిర్మించాల్సింది. అలాగే తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా... ప్రారంభానికి నోచుకోలేదు. ఇన్ని సమస్యలతో తాడిమర్రి, మండలంలోని జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రధానంగా మండలానికి సాగు నీరు అందించాలని రైతులు ఎదురు చూస్తున్నారు. కూటమి పాలకులనైనా ఈ సమస్యలు పరిష్కరించాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేడు మంత్రి రాక

ఎమ్మెల్యే, మంత్రిగా సత్యకుమార్‌యాదవ్ మొదటి సారిగా తాడిమర్రి మండలానికి వస్తున్నారు. గురువారం ఉదయం 10.30గంటలకు తాడిమర్రిలో నిర్వహించే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నిర్వహించే బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం మేడిమాకులపల్లి గ్రామం వద్ద పొలంబడి కార్యక్రమంలో పాల్గొంటారు.



తాడిమర్రిలో రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చిన ఇళ్లు



రామాపురంలో తాగునీటి కోసం పాట్లు



నీరు లేక ఎండిన పీఏబీఆర్ కుడికాలువ



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూటమి హామీలను నెరవేర్చాలి : కాంగ్రెస్

పుట్టపర్తి, సెప్టెంబరు 25 : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికి వదిలేశారన్నారు. వందరోజుల్లో అన్నీ సాధించామని.. ఇది మంచి ప్రభుత్వమని ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇనయతుల్లా నాయకులు గౌస్‌బాషా, నజీర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సైన్స్ టాలెంట్ టెస్ట్

ధర్మవరం, సెప్టెంబరు 25 : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఇందులో ఎంఈఓ-1 రాజేశ్వరి, పాఠశాల హెచ్ఎంలు శైలజ, ఉమాపతి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు, హిందీ పండిట్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, హరిశంకర్, గోవిందు, హరి, శ్రీనివాసులు, నాగరాజు, రఫిక్ పాల్గొన్నారు.

ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న



ధర్మవరం, సెప్టెంబరు 25: ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి వెంకటరమణ అనంతపురానికి బదిలీ అయ్యా రు. కణేకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న తాయన్న బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, రైటర్లు స్వాగతం పలికారు. అదేవిధంగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న వెంకటరమణకు వీడ్కోలు పలికారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు,సెప్టెంబరు 25 : మండలంలోని నారేపల్లిలో ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే విద్యా సామగ్రిని కిజ్మత్‌ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం అందజేశారు. పుట్టపర్తికి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమాని రామలక్ష్మణ్, యువసేన సభ్యుడు బోయ పాటి సునిల్ జన్మదినం సందర్భంగా వాటిని అందజేసినట్లు తెలిపారు.

శ్మశాన వాటిక స్థలం కోసం సర్వే

కొత్తచెరువు, సెప్టెంబరు 25 : కొత్తచెరువు సమీపంలోని నాగులకనుమ సమీపంలో శ్మశాన వాటికకు స్థలసేకరణకు రెవిన్యూ అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. సర్వేయర్ సురేశ్ ఆధ్వర్యంలో సచివాలయ సర్వేయర్, అసిస్టెంట్‌లు, వీఆర్‌ఏలు చెక్‌బందీలను గుర్తించారు. ఆ స్థలాన్ని త్వరలోనే తహసీల్దార్ సహకారంతో పంచాయతీకి అప్పగిస్తామని సర్వేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శీన, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, సన్నాయప్ప పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కదిరి అర్బన్, సెప్టెంబరు 25 : తమకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం ఈ మేరకు వారు ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందచేశారు. ఇందులో సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, ఫాజిల్, బాబ్‌జాన్, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాను తొలగించాలి

నల్లచెరువు, సెప్టెంబరు 25: మండలంలోని దేవిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న వహీలాబీని తొలగించాలని సీడీపీఓ గంగరత్నమ్మకు బుధవారం ఆ గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఆమె విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, పలుమార్లు ఫిర్యాదు చేసినా మార్పు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె నకిలీ సర్టిఫికెట్లతో ఆయాగా చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో బాబాఫకృద్దీన్, బాదుల్లా, మోహన్‌రెడ్డి, శివరాం, జాకీర్‌బాషా, నరేష్ పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

కదిరి, సెప్టెంబరు 25: మోకాళ్ల శస్త్ర చికిత్స కోసం పేర్లు నమోదు చేసుకున్న పింఛనర్లకు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పింఛనర్ల భవనంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి బుధవారం తెలిపారు. శ్రీచక్ర కర్నూల్ వైద్యశాల వైద్యుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు గుండెకు సంబంధించిన వైద్యులూ వస్తున్నట్లు చెప్పారు. పింఛన్‌దారులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పింఛన్ కార్యాలయంలో సంప్రందించాలన్నారు.

పొలం పిలుస్తోంది

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని మల్కాపురం, బడన్నపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ ముస్తాఫ, హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి బుధవారం నిర్వహించారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిసాగులో కాలిబాటలు వేసుకుంటే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. మల్కాపురం గ్రామంలో ఏపీసీఎన్‌ఎఫ్ ఆధ్వర్యంలో ద్రవజీవామృతం తయారు విధానంపై అవగాహన కల్పించారు.

లడ్డూ కల్తీదారులను శిక్షించాలి

నల్లమాడ, సెప్టెంబరు 25 : తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీకి పాల్పడినవారిని కఠినంగా శించాలని గోరంట్ల ప్రఖండ వీహెచ్‌పీ అధ్యక్షుడు ఆదినారాయణ, నల్లమాడ వీహెచ్‌పీ బుట్టి నాగభూషణనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మొదట వారు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా పెద్దన్న

కదిరి అర్బన్, సెప్టెంబరు 25: కదిరి ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా పెద్దన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి డిపోలో పనిచేస్తున్న అయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కదిరి అర్బన్, సెప్టెంబరు 25: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2023-24లో జరిగిన పనులపై సమీక్షించారు. రూ.14,01,78,420 ఖర్చు చేయగా.. రూ.1,38,570 అవినీతి జరిగిందని, రికవరీకి ప్రతిపాదించామని ఎంపీడీఓ ఆంజనప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎపీడీ రమేష్‌బాబు, కూలీలు పాల్గొన్నారు.

అవినీతిపై విచారించండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 25: మండలంలో పలు మహిళ సంఘాల లావాదేవీల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, వాటిని విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐకేపీ ఏపీఎం రమణప్పకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరాంజనేయులు, సురేష్, హరిక్రిష్ణ, నరేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

28న మన ఇల్లు.. మన గౌరవం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : ఈనెల 28న మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి అశ్వర్థనా రాయణనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో లేఅవుట్ స్పెషల్‌ఆఫీసర్, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే మార్చి31లోపు ప్రతి లబ్ధిదారుడు మంజూరైన ఇళ్లను పూర్తీచేసుకోవాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థుల ఆటల పోటీలు ప్రారంభం

కదిరి, సెప్టెంబరు 25: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ 14, 17 బాల, బాలికల 68 స్కూల్ గేమ్స్ ఆటల పోటీలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ముంతాజ్, టీడీపీ నాయకులు డైమండ్ ఇర్షాన్, నాగేంద్ర, రాజేంద్ర నాయుడు, పీఈటీలు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయండి

తనకల్లు : గత వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 117ను రద్దు చేయాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందజేశారు. జీవో 117 పాఠశాలల విలీనం వల్ల పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధ్యాయులకూ పనిభారం పెరిగిందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే జీవోనెంబర్ 117 రద్దు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి, ఉపాధ్యాయులు మురళీధర్‌రావు, శివశంకర్, లక్ష్మీప్రసాద్, ఖాజా, నరసింహులు, శ్రీనివాస్‌గౌడ్, రోజా, రామచంద్ర, మహేష్ పాల్గొన్నారు.

రూ.50 వేలు ఆర్థికసాయం : తనకల్లు దళితవాడలో నాలుగు రోజుల క్రితం టీడీపీ కార్యకర్త పారేసు క్రిష్ణప్ప అనారోగ్యంతో మరణించాడు. ఎమ్మెల్యే కందికుంట బాధిత కుటుంబ సభ్యును పరామర్శించి.. రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట మహ్మబూబ్‌బాషా, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున, దస్తగిరి, దాము, చిన్నప్ప ఉన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తాం: బీజేపీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25 : గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి కార్యాలయ ఉద్యోగి హరీష్, బీజేపీ నాయకులు తెలిపారు. బుధవారం మండలంలోని నేలకోటతండా పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో వారు ప్రజల నుంచి పలు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రధానంగా మురుగునీరు కాలువలు, సీసీ రోడ్లు అవసరమని గుర్తించారు. స్థానిక పాఠశాలలో మౌలిక వసతులు లేని విషయాన్ని గుర్తించారు. అంగన్‌వాడీ సెంటర్ కోసం గ్రామంలో కేటాయించిన మూడు సెంట్లు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జాచేశారని గ్రామస్థులు వారు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ కబ్జాస్థలాన్ని పరిశీలించి దాన్ని అంగన్‌వాడీ సెంటర్‌కు కేటాయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సూర్యనారాయణ, సచివాలయ సెక్రటరీ చంద్రిక, టెక్నికల్ ఆఫీసర్ భాస్కర్, అశోక్, పీఏ మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.



నేలకోటతండా పాఠశాల ఆవరణంలో నిల్వ ఉన్న మురుగునీరు

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

కదిరి, సెప్టెంబరు 25: తలుపుల మండ లంలోని గంజివారిపల్లి ఎస్సీ కాలనీలో గంగన్నకు చెందిన 13 గొర్రెలు విద్యుత్ ప్రమాదంలో బుధవారం మరణించాయి. గొర్రెలను ఇంటి ఆవరణంలోని రేకుల షెడ్‌లో ఉంచానని, షెడ్‌పై నుంచి తీసుకున్న విద్యుత్ వైరు నుంచి కరెంట్ సరఫరా కావడంతో ఆ గొర్రెలు మరణించాయని గంగన్న వాపోయాడు. తనకు రూ. దాదాపు రూ. రెండు లక్షలు నష్టం వాటిల్లిందని, అవే తనకు జీవనాధారమని బోరున విలపించాడు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



ఇసుక లారీ పట్టివేత

బత్తలపల్లి, సెప్టెంబరు 25: ముదిగుబ్బ మండలం నుంచి ఇసుకను లారీలో అక్రమంగా తరలిస్తుండగా... స్థానిక ఆర్డీటీ ఆసుపత్రి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



వికసించిన బ్రహ్మకమలాలు

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 25 : అమడగూరులోని రెడ్డీ హోటల్ యజమాని అంజమ్మ పెరటి తోటలో మంగవారం రాత్రి బ్రహ్మకమలాలు వికసించాయి. ఒకేసారి 30 బ్రహ్మకమలాలు వికసించడం విశేషం.

నేడు చేనేత కార్మికుల ధర్నా

ధర్మవరం, సెప్టెంబరు 25 : బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద చేనేత కార్మిక పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదవస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని గీతానగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో ఆ కమిటీ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ, మోహన్, వెంకటస్వామి, ఆదినారాయణ రవికుమార్, రమణ, ఖాదర్‌బాషా, శ్రీదర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న నాయకులు

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని జగరాజుపల్లిలో బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ. 5.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొన్నారు. విజయవాడ వరదబాధితులను ఆదుకోవడానికి మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, పుట్టపర్తి, కొత్తచెరువు ఉపాధి హామీ ప్రాజెక్ట సిబ్బంది కలిసి మొత్తం 1,67,000ను ఎమ్మెల్యే, మాజీ మంత్రి ద్వారా సీఎం సహాయనిధికి అందచేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

నేడు ధర్మవరానికి మంత్రి రాక

ధర్మవరం, సెప్టెంబరు 25: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం ధర్మవరానికి వస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తాడిమర్రిలో గురువారం ఉదయం 10 గంటలకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో, శుక్రవారం ఉదయం 10గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అభివృద్ధిపై ప్రభుత్వ అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. శనివారం ఎన్డీఏ కార్యాలయంలో ఉదయం పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ, మధ్యాహ్నం 3గంటలకు మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం, నాలుగు గంటలకు పీటీ కాలనీలో మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం ఉదయం ధర్మవరం విష్ణుప్రియ రెసిడెన్సీలో నిర్వహించే ఐఎంఏ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు.

స్కౌట్స్, గైడ్స్ వార్షిక సమావేశం

కొత్తచెరువు, సెప్టెంబరు 25 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లాశాఖ వార్షిక సమావేశాన్ని జిల్లా విద్యాధికారి మీనాక్షి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్నిపాఠశాలల్లో స్కౌట్స్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీటీసీ నాగరాజు గుప్త, డీఓసీ నాగరాజు, జిల్లా ట్రెజరర్ పణిభూషన్ రావు, సీనియర్ స్కౌట్ మాస్టర్లు వెంకటరామప్ప, రామకృష్ణ, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు



పతకాలు చూపుతున్న విద్యార్థులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు యశ్వంత్, విక్రాంత్, అఫ్జల్ మెహారాజ్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 24 వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో యశ్వంత్ 35 కేజీల విభాగంలో, విక్రాంత్ 40 కేజీలు, అఫ్జల్ మెహారాజ్ 50 కేజీల విభాగంలో సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. వీరు వచ్చేనెల 4 నుంచి 8వ తేది వరకు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని పీడీ ప్రతాప్ బుధవారం తెలిపారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : పండింట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు కదిరి, ముదిగుబ్బ, ఓబుళదేవరచెరువు, అమడగూరు తదితర ప్రాంతాల్లో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

విలేకరిపై దాడి - ఎస్పీకి ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25 : ధర్మవరం పట్టణంలో ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి రమేష్‌పై కూటమి నాయకులు సోమవారం దాడి చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా జర్నలిస్టుల సంఘం నాయకులు పుల్లయ్య, బాబు ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎస్పీ రత్నాకు బుధవారం ఫిర్యాదు చేశారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు





చిన్నపాటి వానకే...

కదిరి(అమడగూరు), సెప్టెంబరు 25: అమడగూరులోని ప్రధాన రహదారి చిన్నపాటి వానకే బురద.. బురదగా మారుతోంది. వర్షం వచ్చినప్పుడల్లా రోడ్లపై నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు, పాదచారులు జారి పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి.. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సెమీస్‌కు చేరిన 'పురం' జట్టు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 25: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ క్రీడలు విజయవాడలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నంద్యాలతో 5-0తేడాతో, ఈస్ట్ గోదావరి జిల్లా జట్టుతో పోటీపడి 1-0తేడాతో సత్యసాయి జిల్లా మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణులు సెమీస్‌కు చేరినట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ తెలిపారు. గురువారం ఉదయం కర్నూలు జట్టుతో తలపడనున్నట్లు చెప్పారు. జట్టుకు కోచ్‌గా మహ్మద్‌సలీమ్, దుర్గాప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 25: ఎస్కే యూనివర్సిటీ మంగళవారం విడుదల చేసిన 4వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో ఎన్‌ఎస్‌పీఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీలో 82 శాతం, బీఏలో 96 శాతం, బీకాంలో 80 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఉర్దూ, జువాలజీ, మాథ్స్ సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఉచిత కంటి పరీక్షలు



బాలికలకు చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్

గోరంట్ల, సెప్టెంబరు 25: అరోమా హెల్త్‌కేర్ ఆసుపత్రి సిబ్బంది గోరంట్లలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 205 మందికి డాక్టర్ బొగ్గు సురేష్ పరీక్షలు చేశారు. 40 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి, ఉచితంగా మందులు అందించారు. కళ్ల అద్దాలు అవసరమైన బాలికలకు తక్కువ ధరలకు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది సుధాకర్, సాయిమోహన్, స్రవంతి, లిఖిత, ఏఎన్ఎం విజయబాయి పాల్గొన్నారు.

కంటైనర్ వాహనం దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 25 : పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద బుధవారం కంటైనర్ విద్యుదాఘాతంతో దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ ఎస్ఐ మల్లిర్జునరెడ్డి తెలిపిన మేరకు.. తమిళనాడు నుంచి ఢిల్లీకి డ్రైవర్ హకీముద్దీన్ కంటైనర్‌లో పాత బ్యాటరీలు, సీడీలు, కీబోర్డ్‌లు స్క్రాప్ తరలిస్తున్నాడు. పెనుకొండ సమీపంలోకి రాగానే కంటైనర్‌లో పాత బ్యాటరీలు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపేసి దిగేశాడు. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌లో మంటలను ఆర్పేశారు. దాదాపు రూ.80వేలు ఆస్తినష్టం జరిగినట్లు డ్రైవర్ హకీముద్దీన్ తెలిపాడన్నారు.

డీవైఈఓకు హిందీ సేవా పురస్కారం

పెనుకొండ, సెప్టెంబరు 25 : డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రంగస్వామికి బుధవారం హిందీ సేవా పురస్కారాన్ని అందించారు. బుధవారం హిందీదివస్ కన్వీనర్ జాబిలి చాంద్‌బాషా డీవైఈఓను పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా జాబిలి మాట్లాడుతూ 20న పెనుకొండలో ఘనంగా హిందీదివస్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా డీవైఈఓను హిందీ సేవా పురస్కారంతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు జహీరుద్దీన్ రవీంద్ర, గురువరప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొల్యూషన్ కంట్రోల్ ఈఈ బాధ్యతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25: ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ మునిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్ రెడ్డిని కర్నూలుకు బదిలీ చేయగా, కర్నూలులో ఈఈగా పనిచేస్తున్న మునిప్రసాద్‌ను ఆ స్థానానికి బదిలీ చేశారు. దీంతో మునిప్రసాద్ బుధవారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మధ్యాహ్నం స్థానిక రామ్ నగర్‌లోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మార్చికి గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

గోరంట్ల, సెప్టెంబరు 25: గత ఐదేళ్లలో పక్కా ఇళ్లు మంజూరై నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయని వారు 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, హౌసింగ్ ఏఈ గణేష్‌తో కలిసి బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు బిల్లులు చెల్లించరని అపోహ ప్రజల్లో ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం మన ఇళ్లు, మన గౌరం కార్యక్రమం ద్వారా అవకాశం కల్పించిందన్నారు. నిర్మించకపోతే మార్చి తరువాత ఇళ్లు రద్దు అవుతాయన్నారు. 28న గోరంట్ల వెలుగు కార్యాలయంలో లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహిస్తామ తెలిపారు. సమావేశంలో లేఅవుట్ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త

పారదర్శక పాలనే కూటమి లక్ష్యం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సవిత

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 25 : పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పరిగి మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విట్టాపల్లిలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.57లక్షల నిధులతో భూమిపూజ చేశారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమం అభివృద్ధి పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పైడేటి, గణపతిపల్లి, శీగుపల్లి గ్రామాల్లో పర్యటించి వందరోజులపాలనపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛన్ రూ.4వేలు చేశామని, ప్రతి నెలా 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారదర్శక పాలన అంటే ఏమిటో వంద రోజుల్లోనే చూపించారని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, వ్యవసాయాధికారి విజయభారతి, పంచాయతీ కార్యదర్శి అరుణ, నాయకులు గోవిందరెడ్డి, బాలాజీ, హనుమయ్య, ప్రవీణ్‌రెడ్డి, మారుతి ప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత

టీడీపీతోనే పేదల సంక్షేమం: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలన్నా, అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ, ఆర్‌ఏ పేటలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ రాక్షస పాలనలో అన్నీ విధ్వంసాలే తప్ప అభివృద్ధిపై ఏనాడూ దృష్టి పెట్టలేదని విమర్శించారు. పట్టణంలోని ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మడకశిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్రానికి భవిష్యత్తు ఉండాలన్నా, పేదలకు న్యాయం జరగాలన్నా, యువతకు ఉపాధి మెరుగుపడాలన్నా, పరిశ్రమలు రావాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, నాయకులు శ్రీనివాసమూర్తి, మనోహర్, రాధాకృష్ణ, నరసింహరాజు, ఉమాశంకర్, భక్తర్, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సీడీపీఓకు వీడ్కోలు

గుడిబండ, సెప్టెంబరు 25 : గుడిబండ సీడీపీఓగా పనిచేస్తూ రాయదుర్గానికి బదిలీ అయిన పద్మావతి సేవలు అమోఘమని ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం గుడిబండ సీడీపీఓ కార్యాలయ ఆవరణంలో బదిలీ అయిన పద్మావతికి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పద్మావతి గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సీడీపీఓగా వచ్చి అన్నీ తానై బాధ్యతలు సక్రమంగా చేపట్టారని కొనియాడారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ శాంతలక్ష్మీ, సూపర్‌వైజర్ కమలమ్మ, సభ్యులు మహదేవమ్మ, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉలవలు పంపిణీ

గుడిబండ, సెప్టెంబరు 25 : మండలంలోని సీసీగిరి పంచాయతీ ఆర్బీకే ద్వారా రైతులకు టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ బుధవారం ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉలవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది మహేష్, నాయకులు మహేషప్ప, లక్ష్మీనరసప్ప, ప్రకాశ్, శివకుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మడకశిరటౌన్, సెప్టెంబరు 25 : పట్టణంలోని రామకృష్ణ ఐటీఐ కళాశాలలో బుధవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోర్డ్ సంస్థ మేనేజర్ అశ్వర్థనారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ నరసింహులు తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో కలిసి జీవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి

అగళి, సెప్టెంబరు 25 : రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తూ సేంద్రీయ ఎరువులతో పంటను పండించాలని వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని ఇనగలూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి శేఖర్‌నాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టిసారించాలని సూచించారు. పట్టుపరిశ్రమశాఖ అధికారులు మల్బరీ షెడ్ల స్కీంలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ దాక్షాయని, జెడ్పీటీఎన్ ఎఫ్ సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

మడకశిర రూరల్, సెప్టెంబరు 25 : ఆంధ్రప్రదేశ్ నుంచి యథేచ్ఛగా కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలో సి. కోడిగేపల్లి పంచాయితీలో కర్ణాటక సరిహద్దులోని కేతేపల్లి వద్ద జయమంగళి నదిలోని ఇసుసు రాత్రి పూట అక్రమంగా ఇసుక తరలిస్తు సొమ్ముచేసుకుంటున్నారు. రాత్రి 10 గంటలు తరువాత ట్రాక్టర్లు నదిలో ఉన్న ఇసుకను నింపుకుని కర్ణాటక కు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగలమడకలో దేవదాయశాఖ కమిషనర్

పావగడ, సెప్టెంబరు 25 : చరిత్ర ప్రసిద్ధిగాంచిన నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని కర్ణాటక రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం మహిమను ఎన్నోసార్లు విన్నానని, నేడు ప్రత్యక్షంగా దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భక్తుల సంఖ్య అధికమవుతుండటంతో దేవాలయాన్ని పునర్‌నిర్మించడానికి, అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి కృషిచేస్తానని తెలిపారు. జాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి వెంకటరమణప్ప, దేవదాయశాఖ అధికారి వరదరాజు, ప్రజా పనుల శాఖ అధికారి అనిల్‌కుమార్, ఆగమ పండితుల గ్రూప్ అధ్యక్షులు రాజేశ్వరి, రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు హాజరయ్యారు.

రాయితీతో డ్రిప్ పరికరాల పంపిణీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 25 : ప్రతి రైతుకు రాయితీతో డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్నామని ఏఓ చందన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుద్దేబండ పంచాయతీ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ వ్యవసాయాన్ని రైతుకు ఒకే పండగలా మార్చాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొలంబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్‌కుమార్, సెరికల్చర్ అధికారి జయరాం, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రామక్రిష్ణ, సూరి, బాబుల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

మడకశిరటౌన్, సెప్టెంబరు 25 : పండిత్ దీన్ దయాళ్ 108వ జయంతి వేడుకలను పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతావాది సిద్ధాంత కర్త దీన్ దయాళ్ దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో రాయల కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆర్‌వీ గుప్తా, మండల కన్వీనర్ లెంకప్ప పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, బాలక్రిష్ణ, వెంకటాచలం, షబ్బీర్, ముంతాజమ్మ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయం వద్ద స్థల పరిశీలన

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 25 : అమరాపురం మండల పరిధిలోని హేమావతి హేమావతి సిద్ధేశ్వర ఆలయం వద్ద బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జున్, డీఈ మనూనాయక్, ఏఈ హరి శౌచాలయాన్ని నిర్మించేందుకు కావలసిన స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఆర్‌డబ్ల్యుఎస్ తరఫున రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు అడిగారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.


28న మన ఇల్లు మన గౌరవం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : ఈనెల 28న మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి అశ్వర్థనారాయణనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో లేఅవుట్ స్పెషల్‌ఆఫీసర్, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నక్కలగుట్ట, నల్లగొండ్రాయనపల్లి, చాకర్లపల్లి, మాగేచెరువు, పందిపర్తి, కేతగానిచెరువు గ్రామంలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఆయా లేఅవుట్లలో 28న మన ఇల్లు మన గౌరవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వచ్చే యేడాది మార్చి31లోపు ప్రతి లబ్ధిదారుడు మంజూరైన ఇళ్లను పూర్తిచేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ రామాంజనేయులు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

యూడీసీపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : సోమందేపల్లి పీహెచ్‌సీలో యుడీసీగా పనిచేస్తున్న మధుసూదన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఉద్యోగికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పట్టణమేకాక గ్రామీణ ప్రాంతాల నుంచి చికిత్స కోసం వస్తుంటారన్నారు. పేదలపట్ల వైద్య సిబ్బంది అనుచితంగా వ్యవహరించడం షరామామూలైందన్నారు. యూడీసీ మధుపై అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇతన్ని విధుల్లోంచి తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ హరికుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగప్ప, ఆంజనేయులు, వెంకటేశ్, నాగభూషణం, రవి, హనుమయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, కిష్టప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ప్రపంచ ఫార్మసిస్ట్ డేలో పాలిటెక్నిక్ అధ్యాపకులు, విద్యార్థులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 25: సమాజ సేవలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని ఉమ్మడి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరీష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఫార్మసిస్ట్‌డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర సమయంలో మెడికల్ షాపులు తెరిచి అందులో ఫార్మసిస్టులు చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో విభాగాధిపతులు టి. శ్రీనివాసులు, సుమతి, హరినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రొళ్ల, సెప్టెంబరు 25 : మండలంలోని కొడగార్లగుట్ట ఎస్సీ కాలనీలో ప్రజలు గత ఐదు సంవత్సరాలుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నాలుగు రోజుల్లోపు గ్రామంలో బోరు తవ్వించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హామీ ప్రకారం గ్రామంలో బోరు వేయించి పుష్కలంగా నీరు పడ్డాయి. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

డీఎంహెచ్ఓ మంజువాణి



శ్రేయా డయాగ్నస్టిక్ సెంటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 25: నిబంధనలు పాటించని డయాగ్నస్టిక్ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ మంజువాణి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కొన్ని డయాగ్నస్టిక్ సెంటర్లు, పరిగి రోడ్డులోని ఆర్కే నర్సింగ్ హోంను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ మెడికల్ క్లిరికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ముందుగా నిబంధనల ప్రకారం అనుమతులు పొంది ఉండాలన్నారు. ఆర్కే నర్సింగ్ హోం నిర్వాహకులతో మాట్లాడుతూ చట్ట ప్రకారం మాతాశిశు మరణాల నివారణకు అందించే సేవల్లో లోపాలు ఉండరాదని అన్నారు. నర్సింగ్ హోంను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి లోపాలపై షోకాజ్ నోటీసులు అందించారు. శ్రేయా డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. వారు సెంటర్ ఒక చోట నుంచి మరో చోటుకి మార్చిన విషయం తెలియజేయలేదని షోకాజు నోటీసు అందించారు. ముఖ్యంగా ఆర్ఎంపీలు విచ్చలవిడిగా వైద్యం అందిస్తున్నారనే విషయంపై గట్టిగా హెచ్చరించారు. గత 4 నెలల నుంచి తమ దృష్టికి కూడా వచ్చిందని, కొంత మంది సూది మందులు వేయడమే కాకుండా, చిన్న పాటి సర్జరీలు కూడా చేస్తున్నారని, హద్దులు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 4డివిజన్లలో ఇప్పటికే 3 డివిజన్ల పరిధిలో ఆర్ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు అందించామన్నారు. ఆమె వెంట మాస్‌మీడియా ప్రతినిధి బాబాఫకృద్దీన్, డాక్టర్ పద్మజ తదితరులు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : ధర్మవరంలో గురువారం జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీవద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు గూడే మాధవస్వామి, నాగేశ్వర్‌రావు, గొట్టుముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత రెండో అతిపెద్ద పరిశ్రమ చేనేత అన్నారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దశాబ్దాల కాలం నుంచి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి వెనుకబడిందన్నారు. 11రకాల రిజర్వేషన్ చట్టాలకు అనుమతించి పవర్‌లూమ్స్‌కు పర్మిషన్ ఇచ్చారన్నారు. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో నేతన్నలు ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రిజర్వేషన్‌లను ఉల్లంఘించి చేనేత పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారుతున్న కారణంగా ధర్మవరంలో జరిగే ధర్నాను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, మల్లికార్జున, ఈశ్వరప్ప, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై వేధింపులు ఆపాలి



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : ఆటో కార్మికులపై ఆర్టీఓ, పోలీసుల వేధింపులు తక్షణం ఆపాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడపల్లి బాబా డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక ఆటో డ్రైవర్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఆటో కార్మికులపై ఆర్టీఓ, పోలీసుల వేధింపులు అధికమయ్యాయన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రవాణా రంగాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దానిని విరమించుకోవాలన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, లైసెన్స్ మంజూరు చేసే అధికారాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, మండల నాయకులు రాజగోపాల్, నారాయణస్వామి, చాంద్‌బాష, గంగరాజు, బాబు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 25 : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నందు బుధవారం నూతన పాలకవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సరస్వతి మండల సమాఖ్య అధ్యక్షురాలు హరితమ్మ అధ్యక్షతన 22వ వార్షిక మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య ఓబీలు, సమాఖ్య ఈసీ మెంబర్లు శ్రీనిధి మేనేజర్ పద్మావతి, ఏపీఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో లాక్‌లు, సీసీలు, ఎంఎస్‌ఏలు కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా నిర్మలమ్మ, ఉపాధ్యక్షురాలిగా సుజాతమ్మ, కార్యదర్శిగా సంధ్య, సహాయ కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా ఉషాలను ఈసీ మెంబర్స్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఓబీ, ఎంఎస్‌ఈసీ సభ్యులు, ఎల్‌సీ, సీసీలు, ఎంఎస్‌ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించండి

అగళి, సెప్టెంబరు 25 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. అత్యంత సువిశాలమైన క్రీడా మైదానంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని అనేక మార్లు విద్యుత్ అధికారులకు, సంబంధిత ప్రజాప్రతినిధులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు నిర్వహించేటప్పుడు విద్యార్థులకు అడ్డంగా ఉంటుందని, దీనివల్ల సమస్య ఎదురవుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి క్రీడా మైదానంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరారు.